సాక్షి కామారెడ్డి

గురువారం । 3 । ఆగస్టు । 2023



గరీబోళ్లకు చేరువలో..

అన్ని రకాల వైద్య సేవలు గరీబోళ్లకు చేరువవుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 8లో ▸



పోడు పట్టాలతో..

పోడు పట్టాలతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

33.6 /23.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం సందర్శించారు. రికార్డులు, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, ఉప తహసీల్దార్ ఇందిరా ప్రియదర్శిని, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

5న టీపీటీఎఫ్ నిరసన ప్రదర్శన

కామారెడ్డి టౌన్: జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 5న నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న కార్యక్రమంలో ఉపాధ్యాయులందరు పాల్గొనాలని కోరారు.

గ్రూప్‌-3 శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్‌-3 పోటీ పరీక్షల కోసం 60 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి అర్హులైన మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకోసం కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గాని, 99122 90880, 73062 42629 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ పంపిణీ

కామారెడ్డి టౌన్: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారంనుంచి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్లలోపు ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో ఉన్న 2,92,352 మందికి మాత్రలు వేయడానికి వైద్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ కోరారు.

సహకార శాఖలో ముగ్గురికి పదోన్నతి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న ముగ్గురికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతులు లభించాయి. ఎస్ స్వరూపకు నిజామాబాద్‌లోనే పోస్టింగ్ ఇవ్వగా, ఎ అంబర్‌సింగ్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వి విజయలక్ష్మికి కామారెడ్డి జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు.

పీజీ పరీక్షల్లో 50 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 2వ సెమిస్టర్, ఐఎంబీఏ, అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలలో 670 మంది విద్యార్థులకు 624 మంది విద్యార్థులు హాజరు కాగా 46 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎల్ఎల్‌బీ 4వ సెమిస్టర్ పరీక్షలో 36 మంది విద్యార్థులకుగానూ 32 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారని తెలిపారు.

14 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈనెల 14 నుంచి 28వరకు జరుగుతాయని కంట్రోలర్ ఎం.అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ 2, 4 సెమిస్టర్లు, బీఎల్ఐఎస్సీ 2వ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ 4, 6 సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు.

వైన్‌షాప్‌లకు ముందస్తు టెండర్లు!

- కిక్కెక్కిస్తున్న సర్కారు నిర్ణయం
- ఎన్నికల సీజన్ కావడంతో చాలామందిలో ఆసక్తి
- మద్యం దుకాణాల కోసం తీవ్ర పోటీ ఉండే అవకాశం

మద్యం దుకాణాలకు ముందస్తు టెండర్లు నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. రేపటినుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. ముందుంది ఎన్నికల సీజన్ కావడంతో వైన్‌షాప్‌లపై చాలామంది ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఈసారి మద్యం దుకాణాల కోసం పోటీ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 49 మద్యం దుకాణాలున్నాయి. కామారెడ్డి సర్కిల్‌లో 15, దోమకొండలో 8, ఎల్లారెడ్డిలో 7, బాన్సువాడలో 9, బిచ్కుందలో 10 వైన్‌షాప్‌లున్నాయి. ఇందులో గౌడ సామాజిక వర్గానికి ఏడు దుకాణాలు, ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు రెండు దుకాణాలు రిజర్వ్ చేశారు.

ఈసారి రెట్టింపయ్యే అవకాశం..

గతంలో 2021–23 సంవత్సరాలకుగాను జిల్లాలో 49 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించగా.. 960 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 19.20 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి అంతకు రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఎన్నికల సీజన్ కావడంతో మద్యం అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత వరుసగా పార్లమెంట్, మండల, జిల్లా పరిషత్, పంచాయతీ, మున్సిపల్ అలాగే సహకార సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రెండేళ్ల కాలం మొత్తం ఎన్నికలతోనే గడుస్తుంది. ఎన్నికల సమయంలో మద్యం పెద్ద ఎత్తున అమ్ముడుపోనుంది. దీంతో మద్యం దుకాణాల కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర వ్యాపారాలు చేస్తున్న వారు మద్యం దందాపై ఆసక్తి కనబరుస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్దత ఏర్పడడంతో చాలామంది రియల్టర్లు మద్యం వ్యాపారంవైపు మళ్లే అవకాశాలున్నాయి. మద్యం అమ్మకాలు ఏడాదికేడాది పెరుగుతుండడం, ఏ ఇబ్బందీ లేకుండా ముందుకు సాగుతుండడంతో అందరి కన్ను మద్యం వ్యాపారంపైనే ఉంది. దానికి తోడు ఎన్నికల సీజన్ కావడంతో మద్యం వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో వైన్‌షాప్‌లకు ఈసారి తీవ్రమైన పోటీ ఉండనుంది. ఒక్కో వైన్‌షాప్‌కు నలభై, యాభై దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

అందరిలోనూ ఆసక్తి..

మద్యం దుకాణాలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. 4 నుంచి 18 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 21న డ్రా తీస్తారు. టెండర్లలో పాల్గొనేందుకు చాలామంది ఉత్సాహం చూపుతున్నారు. నలుగురు కలిస్తే మద్యం టెండర్ల గురించే మాట్లాడుకుంటున్నారు. వివిధ వ్యాపారాల్లో భాగస్వాములు, స్నేహితులు గ్రూపుగా ఏర్పడుతున్నారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తు ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. పది మంది కలిసి పది నుంచి ఇరవై దుకాణాలకు టెండర్లు వేయడానికి రెడీ అవుతున్నారు. కొందరైతే డబ్బులు సర్దుబాటు చేసుకునే పనిలో ఉన్నారు. మద్యం దుకాణం వస్తే రెండేళ్లలో మంచి వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుందన్న భావనతో చాలామంది టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పంటరుణాల మాఫీకి అడుగులు!

- రూ. లక్షలోపు మాఫీ అయ్యే అవకాశం
- సీఎం ప్రకటనతో రైతుల్లో ఆశలు



సాక్షి, కామారెడ్డి: పంట రుణాల మాఫీ ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. లక్ష రూపాయలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. తిరిగి అధికారంలోకి వచ్చాక విడతల వారీగా మాఫీ చేస్తామని ప్రకటించారు. అయితే నాలుగేళ్లు దాటినా పూర్తిస్థాయిలో పంట రుణాలను మాఫీ చేయకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటివరకు రూ. 39 వేలలోపు పంట రుణాలే మాఫీ అయ్యాయి. ఆపై రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం పంట రుణాల మాఫీ హామీని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టింది. గురువారం నుంచే రుణమాఫీ ప్రక్రియను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సర్కారు నిర్ణయంతో జిల్లాలో వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఇంతకాలం రుణమాఫీ జరగకపోవడతో అప్పులపై వడ్డీలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రుణ మాఫీకి సంబంధించిన ప్రక్రియ చేపట్టడంతో కొంత ఊరట లభించినట్టయ్యింది.

‘అభ్యంతరాలుంటే తెలపాలి’



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పోలింగ్ కేంద్రాల మార్పుపై అభ్యంతరాలుంటే గురువారం మధ్యాహ్నం 2 గంటలలోగా తెలియజేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉన్నట్లయితే వాటిపై అభ్యంతరాలను తెలపాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు, రమేష్ రాథోడ్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన భూగర్భ జలాలు

- జిల్లాలో సరాసరి నీటిమట్టం 9.24 మీటర్లు..
- గతేడాదికన్నా తక్కువే..



సాక్షి, కామారెడ్డి: ఈ ఏడాది ఆలస్యంగానైనా కురిసిన భారీ వర్షాలతో భూగర్భజలమట్టం కాస్త పెరిగింది. జూన్‌లో సరాసరి నీటిమట్టం 11.91 మీటర్ల లోతులో ఉండగా, జులైలో 9.24 మీటర్లకు చేరింది. అంటే 2.67 మీటర్లు పైకి ఎగబాకింది. అయితే గతేడాది జులైలో 7.24 మీటర్ల లోతులోనే నీరుండడం గమనార్హం. ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జులై రెండో వారం వరకు సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. కానీ జులై రెండో వారం నుంచి వరుసగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. పుల్కల్, బుడ్మి, బాన్సువాడ, గాంధారి, అచ్చంపేట, నర్వ తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు పైకి ఎగబాకాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా భూగర్భజలాలు అట్టడుగునే ఉన్నాయి.

బీసీల అభివృద్ధికి సర్కారు కృషి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ



లబ్ధిదారుకు ఆర్థిక సాయం చెక్కును పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: బీసీలు, చేతి వృత్తుల కుటుంబాలలో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 300 మంది బీసీ లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కుల వృత్తులను కాపాడేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మత్స్యకారులు, గొర్రెల కాపరులకు సర్కారు సాయం అందిస్తోందన్నారు. బీసీ కుల, చేతి వృత్తిదారులకు పూర్తి సబ్సిడీపై ఇస్తున్న రూ.లక్ష రూపాయల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెలా నియోజకవర్గానికి 300 మందికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. త్వరలో మైనారిటీలకు సైతం రూ.లక్ష ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

పారదర్శకంగా ఎంపిక..

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా సాగిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఉచితంగా డబ్బులు వస్తున్నాయని లబ్ధిదారులు దుబారా చేయవద్దన్నారు. తమ వృత్తికి సంబంధించిన పరికరాలను కొనుగోలు చేసి, యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చండి



పద్మాజీవాడి చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న కాయితీ లంబాడీలు

సదాశివనగర్: ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ కాయితీ లంబాడీలు ఆందోళనకు దిగారు. బుధవారం పద్మాజీవాడి చౌరస్తా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సుమారు వెయ్యి మంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారిని దిగ్బంధించడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కాయితీ లంబాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ మాట్లాడుతూ తమను ఎస్టీ జాబితాలో చేర్చుతామని సీఎం కేసీఆర్ గతంలో హామీ ఇచ్చారని, పార్టీ మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని చేర్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక కమిషన్ ఏర్పాటు చేసి కాలాయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980లలో ఎస్టీ జాబితాలో ఉన్నప్పుడు పలువురు కాయితీ లంబాడీలు రాజకీయ పదవులు పొందారని, ఉద్యోగాలు సైతం సాధించారని గుర్తు చేశారు. ఎస్టీ జాబితాలోంచి తొలగించడంతో 38 ఏళ్లుగా తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాస్తారోకో విరమించాలని సీఐ రామన్, ఎస్సై రాజుతో పాటు ఇతర మండలాల ఎస్సైలు ఆందోళనకారులను కోరడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సదాశివనగర్, గాంధారి మండలాలకు చెందిన కాయితీ లంబాడీలు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన



రెడ్డిపేట గ్రామ పర్యటనకు వచ్చిన అదనపు కలెక్టర్ మను చౌదరిని సన్మానిస్తున్న అధికారులు

రామారెడ్డి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి బుధవారం రామారెడ్డి మండలంలో పర్యటించారు. ఆయన కామారెడ్డి డీఎస్పీ ఆర్ ప్రకాష్, ఎఫ్‌బీవో గోపాల్‌రావులతో కలిసి మండలంలోని 11 గ్రామపంచాయతీల పరిధిలో పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలను పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్ ప్రక్రియలో భాగంగా గ్రామాలను సందర్శించి వారి పనితీరును సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీవో సవిత, రెడ్డిపేట సర్పంచ్ సునందన, పంచాయతీ కార్యదర్శి నవీన్ తదితరులున్నారు.

ఠాణాను సందర్శించిన ఎస్పీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను, ఠాణా పరిసరాలను పరిశీలించారు. కేసుల విచారణను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌హెచ్‌వో నరేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

‘ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి’



డీఎంహెచ్‌వోకు వినతిపత్రమిస్తున్న ఏఎన్‌ఎంలు

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. బుధవారం ఈ విషయమై డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1,520 మంది ఎంపీహెచ్‌ఏ ఫీమేల్ ఉద్యోగాల భర్తీ కోసం ఇటీవల వేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, వారిస్థానంలో 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లక్ష్మి, దీవెన, రజని, రేణుక తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

- పంచాయతీ కార్మికుల విన్నపం
- వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన



వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

బీబీపేట: తమ డిమాండ్లను నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం బీబీపేటలో ఐదుగురు కార్మికులు వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఐదు గంటలపాటు అక్కడే ఉన్నారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లను పరిష్కరించాలని పట్టుబట్టారు. కలెక్టర్ వచ్చేవరకు కిందికి దిగబోమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనులు చేసిన కార్మికులను చిన్నచూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయిరెడ్డి వాటర్ ట్యాంక్ వద్దకు వచ్చి సముదాయించేందుకు యత్నించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయినాథ్, జనగామ సర్పంచ్ రాజు సైతం నచ్చజెప్పాలని చూశారు. అయినా పంచాయతీ కార్మికులు వినలేదు. డీఎల్‌పీవో సాయిబాబా సంఘటన స్థలానికి చేరుకొని వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చారు.

ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలి

కామారెడ్డి టౌన్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులను సర్కారు చిన్నచూపు చూస్తోందని, బంగారు తెలంగాణ అంటే ఇదేనా అని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. డిమాండ్లను పరిశీలించాలంటూ పంచాయతీ కార్మికులు బీబీపేటలో వాటర్ ట్యాంక్ ఎక్కిన విషయం తెలుసుకున్న షబ్బీర్ అలీ వారితో ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డిమాండ్లను నెరవేరుస్తామన్నారు. అనవసరంగా ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని, ప్రభుత్వంతో కొట్లాడుదామని వారికి నచ్చజెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పంచాయతీ కార్మికులకు నచ్చజెప్పి ట్యాంక్‌పైనుంచి దింపాలని కోరారు.

క్లుప్తంగా

జుక్కల్ అసెంబ్లీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి



బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ అసెంబ్లీ టికెట్‌ను బీఆర్‌ఎస్ పార్టీ ఈ సారి మాదిగలకు కేటాయించి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం బిచ్కుందలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు గంగారాం మాట్లాడుతూ..అన్ని రంగాలలో ప్రభుత్వాలు మాదిగ జాతికి ఎదగనీయకుండా అణచివేతకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈసారి టికెట్ మాదిగ జాతికి చెందిన సామాజిక కార్యకర్త హెచ్‌ఎం సీతయ్యకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో మాదిగలకు 46 వేల ఓట్లు ఉన్నాయని తెలిపారు.

బాల కార్మికులుంటే 1098కి తెలియజేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): దుకాణాలు, హోటళ్లు, కంపెనీలలో బాల కార్మికులు పని చేస్తున్నట్లు తెలిస్తే 1098కి సమాచారం అందించాలని సాధన స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ రేఖ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులు పని చేసిన, బాల్య వివాహాలు జరిగినా, చిన్న పిల్లలను ఎవరైనా కిడ్నాప్ చేసినా 1098కి సమాచారం అందించాలని అన్నారు.

గరీబోళ్లకు చేరువలో వైద్యం



బిచ్కుందలో అంబులెన్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- బిచ్కుందలో అంబులెన్సుల ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): గరీబోళ్లకు చేరువలో అన్ని రకాల వైద్య సదుపాయాలు రానున్నాయని, బిచ్కుంద ఆస్పత్రి త్వరలో వంద పడకల ఆస్పత్రిగా మారనుందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. జుక్కల్ జోన్‌లో ఒక వంద పడకల ఆస్పత్రి ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని అన్నారు. బుధవారం బిచ్కుంద, జుక్కల్ ఆస్పత్రికి ప్రభుత్వం కొత్తగా రెండు 108 అంబులెన్స్‌లను కేటాయించడంతో వాటిని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్య, విద్య, వ్యవసాయ రంగాలలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మద్నూర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, పిట్లంలో సెంట్రల్ లైటింగ్ కోసం రూ.32 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే బిచ్కుందలో రోడ్డు విస్తరణ పనులు, మద్నూర్‌లో డిగ్రీ కళాశాల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. బిచ్కుంద, జుక్కల్ ఎంపీపీలు అశోక్, నీలు పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, సాయాగౌడ్, బొల్లి గంగాధర్, వెంకట్‌రావు, వైద్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే హన్మంత్ సింధే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలపై భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం ఇవ్వడమే కాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన తుమ్‌వార్ సునీతకు రూ.లక్ష, డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గాకు చెందిన అశోక్ షెట్కార్‌కు రూ.2.50 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సర్పంచ్‌లు సురేష్, రాజు, పార్టీ అధ్యక్షుడు బస్సీపటేల్, తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు అడ్డగింత

ఎల్లారెడ్డి: హాజీపూర్ తండావాసులు బుధవారం ఎల్లారెడ్డి– కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. హాజీపూర్ తాండా నుంచి సేవాలాల్ ఆలయం వరకు సీసీ రోడ్డు వేస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు అనుమతులివ్వాలని ఆందోళన చేశారు. ఈ విషయమై ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్‌ను వివరణ కోరగా..అనుమతులు లేకుండా పనులు చేయడంతోనే సీసీ రోడ్డు పనులను ఆపినట్లు తెలిపారు. పనులు సాగేలా అధికారులతో మాట్లాడతామని పోలీసులు సముదాయించడంతో తండావాసులు రాస్తారోకో విరమించారు.



హాజీపూర్‌లో ఆందోళన చేస్తున్న తండావాసులు

వరి నాటు వేసే విధానంపై అవగాహన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని రుద్రూర్, జగిత్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు నవీన్ కుమార్, రాజ్‌కుమార్‌లు సూచించారు. బుధవారం అడ్లూర్‌ఎల్లారెడ్డిలో మర్రి సంగారెడ్డి రైతు వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నాటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. వరిని ఆశించే చీడపీడలను ఏ విధంగా అరికట్టవచ్చో వివరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు బాల్‌రాజు, విండో సీఈవో భైరయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందంజ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ అన్నారు. బుధవారం నెమ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాథమిక సభ్యులు ప్రతి ఒక్కరు సంఘానికి పునాది అన్నారు. సభ్యత్వ నమోదులోను పీఆర్‌టీయూ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. మండల అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు ఉన్నారు.



సభ్యత్వం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలి

- జెడ్పీటీసీ ఆరోపణలపై అన్నారం సర్పంచ్ ఆగ్రహం

రామారెడ్డి (ఎల్లారెడ్డి): అన్నారం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో తాను డబ్బులు తీసుకున్నానని అనవసర ఆరోపణలు చేస్తున్న రామారెడ్డి జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకులు రుజువులు చూపించాలని అన్నారం సర్పంచ్ అమృత డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ సర్పంచ్ అమృత మాట్లాడారు. గ్రామంలో 30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు 90 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని, రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి అర్హులను గుర్తించి 25 మందికి లక్కీ డ్రా ద్వారా రామారెడ్డి తహసీల్ ఆఫీసులోనే కేటాయించారని తెలిపారు. మరో ఐదు ఇళ్లను పెండింగ్‌లో పెట్టారని వెల్లడించారు. దీనిపై రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్ రెడ్డి తనపై అసత్య ప్రచారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాను డబ్బులు తీసుకున్నట్లు రుజువులు ఉంటే చూపించాలని ముక్కు నేలకు రాసి తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నారం సర్పంచ్ అమృత

స్పీకర్‌ను విమర్శిస్తే ఊరుకోం

బాన్సువాడ: సంబంధం లేని విషయాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం బాన్సువాడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులుగా బాన్సువాడలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ధర్నాలు చేస్తూ ఎటువంటి సంబంధం లేకుండా స్పీకర్‌పై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలో కుస్తీ పట్టే జాతీయ పార్టీలు బాన్సువాడలో మాత్రం దోస్తీ కడుతున్నాయని, రెండు పార్టీలు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ధర్నాలు చేస్తున్నారని అన్నారు. నాయకులు కృష్ణారెడ్డి, పాత బాలకృష్ణ, ఎజాస్, జంగం గంగాధర్, శ్రీధర్, మోహన్‌నాయక్, వనం గంగాధర్, విఠల్‌రెడ్డి, రమాదేవి, గంట్యాల బాలకృష ఉన్నారు.

పర్మినెంట్ చేయాలని వినతి



బాన్సువాడ: హోంగార్డులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డికి డివిజన్‌లోని హోంగార్డులు వినతి పత్రం అందజేశారు. డివిజన్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు నాయిని మొగులయ్య మాట్లాడుతూ.. పర్మినెంట్ చేసేందుకు ఉన్నతాధికారులు కృషి చేయాలని అన్నారు. హోంగార్డుల సంఘం ఉపాధ్యక్షుడు రామాగౌడ్, కార్యదర్శి కుర్మ మొగులయ్య, కోశాధికారి రాజేశ్వర్, తదితరులున్నారు.

డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని..



బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగేడ్గి ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని బుధవారం ఇన్‌చార్జి మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావుకు ఎస్‌ఎంసీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసీ చైర్మన్ సాయిలు మాట్లాడుతూ.. బరంగేడ్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి తరగతులను కొనసాగిస్తున్నామని, పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు నష్టపోతున్నారని, మరో ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారని అన్నారు. విద్యావాలంటీర్లను నియమించలేదని, ఉపాధ్యాయుల కొరత దృష్టిలో ఉంచుకుని తిరిగి రప్పించాలని విన్నవించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బాల్య వివాహాలను అరికట్టాలని కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ ప్రీతి అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహాయంతో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాలల అక్రమరవాణా, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బాలల అక్రమ రవాణా జరిగినట్లు తెలిసినా, ఎక్కడైనా చూసినా వెంటనే సాధన సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలని కోరారు. అలాగే పిల్లలపై లైంగిక వేధింపులు జరిగినా, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనపడితే సమాచారాన్ని అందించాలని సూచించారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా 1800 102 7222 టోల్‌ఫ్రీ నంబరుతో పాటు, చైల్డ్‌లైన్1098 నంబరును సంప్రదించాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్, సాధన సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రీతి

పద్మశాలి యుద్ధబేరిని విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: పద్మశాలీల హక్కుల సాధన కోసం ఈ నెల 13న తలపెట్టిన చలో కోరుట్ల యుద్ధబేరిని విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సింలు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పద్మశాలీలు ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని అన్నారు. అనంతరం కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చాట్ల రాజేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐరన్ నర్సయ్య, షేర్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పద్మశాలి నేతలు

నాణ్యమైన పురుగు మందులే విక్రయించాలి



మాచారెడ్డి: పురుగు మందులు, విత్తన డీలర్లు నాణ్యమైనవి మాత్రమే విక్రయించాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ–పాస్ క్లియరెన్స్, స్టాక్ బోర్డ్ ఎంట్రీ స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రమాణాలు పాటించని పలు వురు డీలర్లకు నోటీసులు జారీ చేశారు. రైతు బీమా పథకం కోసం కొత్త పట్టాదారులు తప్పకుండా నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ నెల 5 వరకు రైతులు దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయ విస్తరణ అధికారికి అందించాలన్నారు.

మాజీ సైనికులకు భవనం కేటాయించాలని వినతి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో మాజీ సైనికులకు భవనం, కాలనీ ఏర్పాటు చేయాలని కోరుతూ కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు, జిల్లా పూర్వ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రభుత్వ విప్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. జిల్లాలో 150 మంది మాజీ సైనికులున్నారని కార్యాలయం ఏర్పాటు కోసం 360 గజాల స్థలం లేదా భవనం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనల మేరకు స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు కేవీ పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి



వర్ని: వర్నిలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో కోటగిరి గ్రామానికి చెందిన కూచి లక్ష్మణ్ (59) పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. కోటగిరికి చెందిన లక్ష్మణ్ బుధవారం ఉదయం బహిర్ భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడు సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

రుద్రూర్: రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన మ్యాతరి వీరేశం (62) చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం వెళ్లిన వీరేశం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ చెరువులో మృతదేహం లభ్యమైంది. చేపలు పడుతుండగా నీటిలో జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బోలిగద్ద కిషన్ (30) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం తన బైక్‌పై అడ్లూర్ శివారులోని తన సోదరి పొలం వద్దకు వెళ్లాడు. నాటు వేస్తుండగా గుండెలో నొప్పి వస్తుందని బైక్ వద్ద వచ్చి కూర్చొని అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రుద్రూర్: కోటగిరికి చెందిన కొత్వాల్ సాయికుమార్(27) తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. సాయికుమార్ భార్య ఎనిమిది నెలల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం గ్రామ శివారులోని గుట్ట ప్రాంతానికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరికెల లక్ష్మి ఇంటికి తాళం వేసి గత సోమవారం హైదరాబాద్‌కు వెళ్లింది. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయానికి తాళం పగుల గొట్టి ఉంది. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని నాలుగు తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇంటిని పరిశీలించి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేశారు.

పోత్నూర్ బెల్ట్ షాప్‌లో..

సిరికొండ: మండలంలోని పోత్నూర్‌లో వినోద్‌కు చెందిన మద్యం బెల్ట్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు దుకాణం తాళం పగులగొట్టి రూ. లక్ష విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. ఎస్సై రమేశ్ చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించారు.



దూదిగాంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కోడి కూర కోసం దాడి

ఖలీల్‌వాడి: చికెన్ వేయలేదని మేనమామను కట్టెతో కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన చింతల రాజు ఇంట్లో మంగళవారం చికెన్ వండారు. రాజు అక్క కుమారుడు సుమన్ మద్యం మత్తులో చికెన్ వేయాలని కోరగా ఇద్దరి మధ్య మాటలు లేనందున చికెన్ వేయలేమని చెప్పారు. దీంతో కోపోద్రిక్తుడైన సుమన్ పక్కనే ఉన్న కట్టెతో రాజు తలపై బాదాడు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. రాజు భార్య గౌరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: సాలూర మండలం కుమ్మన్‌పల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఏఎస్సై రవీందర్ బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.4వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండల కేంద్రానికి చెందిన ఇమ్మాన్యుయేల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇమ్మాన్యుయేల్‌కు నిజామాబాద్‌కు చెందిన ఎస్తేరుకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాలతో నాలుగేళ్లుగా వీరు వేర్వేరుగా ఉంటున్నారు. ఇమ్మాన్యుయేల్ తరచూ ఎస్తేరుతోపాటు వాళ్ల అమ్మను డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. తాజాగా మండల కేంద్రంలోని చర్చి ప్రధాన ద్వారానికి రెండ్రోజుల క్రితం కారు అడ్డుగా పెట్టాడు. కారు తీసేయాలని చెప్పినా విన్పించుకోకపోవడంతో ఎస్తేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలు కింద పడి ఒకరి మృతి

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల ఉంటుందన్నారు.

ఒకరి అదృశ్యం



రామాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి వచ్చిన అబ్బగోని రామాగౌడ్ అదృశ్యమైనట్లు ఎస్సై రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన రామాగౌడ్ (65) 15 రోజుల క్రితం తన కూతురిని చూసేందుకు డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ వచ్చాడు. మూడు రోజుల పాటు అక్కడే ఉండి జూలై 19న సాయంత్రం బయటకు వెళ్లొస్తానని చెప్పి బైక్‌ను తీసుకుని వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. కూతురు రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నందిపేటలో మహిళ..

నందిపేట్: నందిపేట్‌లోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన మిరియాల లక్ష్మి (40) అదృశ్యమైంది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాలు.. గత నెల 29న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గొర్రెల మందపై చిరుత దాడి

ఎల్లారెడ్డిరూరల్: గొర్రెల మందపై చిరుత దాడి చేసిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. తండాలోని లునావత్ రాంచందర్ మంగళవారం తన గొర్రెల మందను తీసుకుని మేతకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక మూడు గొర్రెలు కనబడలేదు. దీంతో బుధవారం అటవీ ప్రాంతంలో గాలించగా ఒక గొర్రె చనిపోయి కనిపించింది. చిరుత దాడిలో గొర్రె చనిపోయినట్లు గుర్తించాడు. అటవీశాఖ అధికారులు పరిహారం అందించాలని బాధితుడు కోరాడు. చిరుత సంచారంతో తండావాసులు ఆందోళన చెందుతున్నారు.